
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 25 జూలై 2024



బీఆర్ఏయూలో వచ్చే నెల జాతీయ సెమినార్

ఎచ్చెర్ల, జూలై 24: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంటు విభాగం ఆధ్వర్యంలో వచ్చే నెల 30,31 తేదీల్లో జాతీయ సెమినార్ నిర్వహించనున్నారు. ఈ మేరకు బ్రోచర్‌ను వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని బుధవారం ఆవిష్కరించారు. ఈ విభాగానికి చెందిన సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ కె. అచ్యుతరావు కన్వీనర్‌గా డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంటు అనే అంశంపై ఈ సెమినార్‌ను నిర్వహిస్తారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.సుజాత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అనూరాధ పాల్గొన్నారు.

అమ్మో.. జ్వరం



- జిల్లాలో విజృంభిస్తున్న వ్యాధులు
- వెలుగుచూస్తున్న డెంగ్యూ కేసులు
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- కానరాని ముందస్తు చర్యలు

(రణస్థలం)

జ్వరం.. ఈ మాట వింటేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు. ముఖ్యంగా డెంగ్యూ జ్వరాలు సోకుతుండడంతో ఆందోళన చెందుతున్నారు. తొలుత చిన్నపాటి జ్వరంగా ప్రారంభమై.. విజృంభిస్తోంది. రక్తకణాలు తగ్గుముఖం పట్టి ప్రమాదకరంగా మారుతోంది. అందుకే చిన్నపాటి జ్వరం వచ్చినా ప్రజలు భయపడిపోతున్నారు. అధికారులు మాత్రం ఒకటి అరా అని చెబుతున్నా.. జిల్లాలో పదుల సంఖ్యలో డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. ఏటా జూలై 1 నుంచి 30 వరకూ డెంగ్యూ నియంత్రణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నా ఫలితం లేకపోయింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజారోగ్యం కుంటిపడిందన్న విమర్శలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం కొలువుదీరి నెలరోజులు పూర్తికాగా.. ఈ ఏడాది సైతం అధికారులు ముందస్తు చర్యలు చేపట్టలేదన్న విమర్శలున్నాయి. సాధారణంగా జూలై నుంచి అక్టోబరు వరకూ వ్యాధుల కాలం. వీటిని ఎదుర్కొనేందుకు అధికారులు ముందస్తు సన్నాహాలు చేయాలి. కానీ జిల్లాలో అటువంటివేమీ కానరాలేదు. దీంతో ప్రజలు జ్వరాల బారినపడి ప్రాణాలమీదకు తెచ్చుకుంటున్నారు. ముఖ్యంగా విద్యార్థులు, యువత మృతి చెందడం విచారకరం.

● వైద్యసేవలు అంతంతమాత్రం..

శ్రీకాకుళంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, టెక్కలిలో ఏరియా ఆస్పత్రి పెద్దాస్పత్రులుగా ఉన్నాయి. వీటితో పాటు 64ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 10 సీహెచ్‌సీలు, 300 వరకూ ఉప కేంద్రాలు ఉన్నాయి. వీటిలో వైద్య సేవలు సక్రమంగా అందక రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ఇటీవల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వైద్యఆరోగ్య శాఖ నిర్లక్ష్య పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు.

● ప్రస్తుతం జిల్లాలో జ్వరపీడితులు, రోగులతో ఆస్పత్రులు నిండిపోతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ తూతూ మంత్రపు చర్యలకే పరిమితమవుతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏటా వర్షాకాలం నాటికి వైద్యారోగ్య శాఖ ముందస్తు చర్యలు చేపట్టేది. సీజనల్ వ్యాధులు ఎదుర్కొనేందుకు అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచేది. ఆస్పత్రి సలహా మండలి సమావేశాలు నిర్వహించేది. కానీ ఈ ఏడాది ఆ ప్రణాళిక కొరవడింది. అలాగే పీహెచ్‌సీల్లో 24 గంటలూ వైద్యం ప్రకటనలకే పరిమితమవుతోంది. సాయంత్రం 5 గంటలు దాటితే పీహెచ్‌సీలకు తాళాలు పడుతున్నాయి. వైద్యులు, సిబ్బంది ఎవరూ కానరారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది స్థానికంగా నివాసం ఉండాలన్న నిబంధన ఎక్కడా అమలుకావడం లేదు. ఎక్కువమంది సుదూర ప్రాంతాల్లోని పట్టణాలు, మండల కేంద్రాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. వైద్యులు సక్రమంగా అందుబాటులో లేక అత్యవసర వైద్యానికి వచ్చే వారికి నిరాశ ఎదురవుతోంది. దీనికితోడు గ్రామాల్లో పారిశుధ్య పనులు నిలిచిపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ఫలితంగా మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలతో పాటు వివిధ వ్యాధులు ముసురుతున్నాయి.


టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

● డెంగ్యూ నిర్ధారణకు ప్రామాణికమేదీ?

డెంగ్యూ జ్వరాల నిర్ధారణలో దోపిడీ కొనసాగుతోందన్న విమర్శలున్నాయి. డెంగ్యూ నిర్ధారణ విషయంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దిష్టమైన సూచనలు చేసింది. ర్యాపిడ్ పరీక్షలు ద్వారా డెంగ్యూ నిర్ధారణ అయిన తర్వాతే చికిత్స అందించాలి. వైద్య ఆరోగ్యశాఖ మాత్రం ర్యాపిడ్ పరీక్షను పరిగణనలోకి తీసుకోమని చెబుతోంది. ఇంతలో రోగి ప్లేట్‌లెట్స్ పడిపోతున్నాయి. అయితే ఎలిషా పరీక్ష తరువాతే రోగికి వైద్యసేవలందిస్తామని ప్రభుత్వ వైద్యులు చెబుతున్నారు. అయితే జిల్లాకు సంబంధించి సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో మాత్రమే ఎలీషా పరీక్షలు జరుగుతున్నాయి. ఎలిషా పరీక్షకు సంబంధించి పీహెచ్‌సీల్లో ఎటువంటి ఏర్పాట్లు చేయలేదు. దీంతో వైద్యసేవల్లో జాప్యమవుతోంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఎలీషా పరీక్షలు జరిగేలా చూడాల్సిన అవసరం ఉంది.


జేఆర్ పురంలో మురుగునీటిలో దోమలు

● పారిశుధ్య లోపం..

ప్రధానంగా పారిశుధ్యం లోపించిన ప్రాంతాల్లోనే జ్వరాలు వెలుగుచూస్తున్నాయి. శ్రీకాకుళం నగర పాలక సంస్థ, ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ, ఆమదాల వలస మునిసిపాలిటీలు, మేజర్ పంచాయతీల పరిధిలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది. దీంతో ప్రస్తుతం గ్రామాల్లో కనీసం పారిశుధ్య పనులు చేయించేందుకు సైతం నిధులు లేని పరిస్థితి నెలకొంది. ఫలితంగా పారిశుధ్యం క్షీణించి.. వ్యాధుల వ్యాప్తికి కారణమవుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి.. పారిశుధ్యం మెరుగుపరిచేలా దృష్టి సారించాలని కోరుతున్నారు. అలాగే జ్వరాల నివారణకు వైద్యఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

● ఈ నెల 8న సరుబుజ్జిలి మండలం వెన్నెలవలస గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బిడ్డిక రక్షిత అనే ఎనిమిదేళ్ల చిన్నారి జ్వరంతో మృత్యువాత పడింది. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మండలం అచ్చబా గ్రామానికి చెందిన రక్షిత ఈ నెల 3న పాఠశాలకు వచ్చింది. మరుసటి రోజునే జ్వరం బారిన పడింది. మలేరియా అని వైద్యులు నిర్ధారించారు. వైద్యసేవలు పొందుతూ ఆ విద్యార్థిని మృత్యువాత పడింది.

....

● ఈ నెల 11న కోటబొమ్మాళి మండలం వరహాలమ్మపేటకు చెందిన రాజు అనే విద్యార్థి జ్వరంతో మృతి చెందాడు. ఏడో తరగతి చదువుతున్న రాజు కొద్దిరోజుల కిందట జ్వరంబారిన పడ్డాడు. తొలుత ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆయనను చేర్పించారు. తర్వాత శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

....

● ఈ నెల 21న ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన తిప్పల విఘ్నేష్ రెడ్డి(21) అనే యువకుడు డెంగ్యూ లక్షణాలతో మృతిచెందాడు. ఇటీవల జ్వరంబారిన పడడంతో ఒక్కసారిగా ప్లేట్‌లెట్స్ తగ్గుముఖం పట్టాయి. దీంతో కుటుంబసభ్యులు హుటాహుటిన విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ విఘ్నేష్‌రెడ్డి మృతి చెందాడు.

....

● పోలాకి మండలం కొత్తరేవు పంచాయతీ జోగంపేటలో ఇటీవల జ్వరాలు వ్యాపించాయి. ఇంటింటా జ్వరాలు సోకడంతో గుప్పెడుపేట పీహెచ్‌సీ సిబ్బంది ఈ నెల 11న గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. రక్తనమూనాలు సేకరించారు. పదో తరగతి విద్యార్థికి డెంగ్యూ లక్షణాలు వెలుగు చూశాయని తెలుస్తోంది. దీంతో గ్రామంలో ఆందోళన నెలకొంది.

గులుమూరులో పెరుగుతున్న డెంగ్యూ బాధితులు

హిరమండలం: గులుమూరులోనూ డెంగ్యూ జ్వరాలు విజృంభిస్తున్నాయి. మాజీ సర్పంచ్ కొత్తపల్లి అప్పలరాజు ఇటీవల జ్వరంతో బాధపడగా.. కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆస్పత్రికి ఆయనను తరలించారు. వైద్యులు రక్తనమూనాలు పరిశీలించి డెంగ్యూగా నిర్ధారించారు. ఆయన కుటుంబంలో మరో నలుగురు కూడా డెంగ్యూతో బాధపడుతూ.. శ్రీకాకుళం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చాలామందికి ప్లేట్‌లెట్స్ తగ్గిపోవడంతో గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. జ్వరపీడితులు పెరుగుతున్నా.. తమకు పీహెచ్‌సీ ద్వారా వైద్యసేవలు సక్రమంగా అందడం లేదని బాధితులు వాపోతున్నారు.


చికిత్స పొందుతున్న అప్పలరాజు


నందిగాంలో జ్వరపీడితులు

విషజ్వరాల వ్యాప్తితో ఆందోళన

నందిగాం: నందిగాం ఎస్టీ వీధి, కాలనీల్లో విషజ్వరాలు వ్యాప్తి చెందుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఒక్కో కుటుంబంలో ఇద్దరేసి, ముగ్గురేసి జ్వరాలు బారిన పడ్డారు. ఈ నేపథ్యంలో గ్రామంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి.. విషజ్వరాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మెరుగైన సేవలందిస్తున్నాం

రోగులకు మెరుగైన సేవలందిస్తున్నాం. జిల్లాలో జనవరి నుంచి ఇప్పటివరకూ 8 డెంగ్యూ, 13 మలేరియా, 4 టైఫాయిడ్ కేసులు నమోదయ్యాయి. ఆస్పత్రుల్లో వసతులు మెరుగుపరుస్తున్నాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. ఇప్పటికే అన్ని ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉంచాం. ప్రజలు పరిశుభ్రతను పాటించాలి. వేడినీటినే తాగాలి. వంట పదార్థాలపై మూతలు వేయాలి. నిర్లక్ష్యం వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై వేటు తప్పదు.

- బి.మీనాక్షి, డీఎంహెచ్‌వో, శ్రీకాకుళం

కొలిక్కి వచ్చేదెప్పుడో?


నిలిచిన పోర్టు పనులు

- నేటికీ తేలని ఉప్పు భూముల పరిహారం
- మూలపేట పోర్టు నిర్మాణానికి తొలగని అడ్డంకులు

(టెక్కలి)

మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణంపై నీలినీడలు కమ్ముకున్నాయి. సంతబొమ్మాళి మండలం మూలపేటలో ఈ పోర్టు నిర్మాణానికి సంబంధించిన అడ్డంకులు తొలగించకుండానే గతేడాది ఏప్రిల్ 19న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారు. పోర్టు నిర్మాణానికి 826.51 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించినా.. ఇప్పటికీ 293.97 ఎకరాల ఉప్పు భూములను సేకరించలేదు. మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు సంబంధించి విశ్వసముద్ర సంస్థ రూ.4,361.91 కోట్లతో టెండర్లు దక్కించుకుంది. 2026 నాటికి మొదటి రవాణా ప్రక్రియ జరిపించాలని భావించినప్పటికీ ఆ పరిస్థితి కనిపించడం లేదు. వాస్తవానికి మూలపేట, కస్పానౌపడా, మర్రిపాడు ప్రాంతాల్లో 4,401.24 ఎకరాల ఉప్పుభూములు ఉన్నాయి. వాటిలో 293.97 ఎకరాలు.. రైలు, రోడ్డు, పోర్టు నిర్మాణాలకు అవసరం. ఈ భూములకు సంబంధించి పరిహారం చెల్లించడంలో రెవెన్యూ అధికారులు సంబంధిత సాల్ట్ కమిషనర్లతో పలుమార్లు చర్చలు జరిపినా కొలిక్కిరాలేదు. మార్కెట్ ధర ప్రకారం ఎకరాకు రూ.4లక్షలు చెల్లిస్తామని రెవెన్యూ అధికారులు చెబుతుండగా.. సాల్ట్ కమిషనర్లు ఎకరాకు రూ.25 లక్షలకు పైగా డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఉప్పు భూముల సమస్య నేటికీ పరిష్కారానికి నోచుకోలేదు. అలాగే పోర్టుకు సంబంధించి రైలు మార్గం కోసం 72 ఎకరాలు అవసరమని రెవెన్యూ అధికారులు గుర్తించారు. పోతునాయుడుపేట, యామాలపేట, రాజపురం, కాశీపురం, కోటపాడు, కూర్మనాథపురం ప్రాంతాలకు సంబంధించి 142 మంది రైతుల వద్ద 72 ఎకరాలు సేకరించగా.. చెల్లింపుల ప్రక్రియ మధ్యలోనే నిలిచిపోయింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పోర్టు పనులన్నీ నిలిచిపోయాయి. ఇటీవల కొత్త కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్.. పోర్టు పనులను పరిశీలించారు. మొత్తంగా గత ముఖ్యమంత్రి జగన్ ఉప్పుభూముల ప్రక్రియ తేలకుండానే శంకుస్థాపన చేయడం, ఆ తరువాత ఎన్నికల సమయంలో ఈ ప్రాంతానికి ప్రచారానికి వచ్చినప్పుడు పోర్టు ప్రాంతాన్ని హెలీకాప్టర్ ద్వారా వీక్షించడం, ఇదంతా తమ ప్రభుత్వ ప్రగతి అంటూ అప్పటి వైసీపీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, సీదిరి అప్పలరాజు, రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి గొప్పలు చెప్పుకోవడం మినహా క్షేత్రస్థాయిలో లోపాలు సరిదిద్దడంలో విఫలమయ్యారు. ఉప్పు భూముల విషయమై సబ్‌కలెక్టర్ నూరుల్‌ఖమర్ వద్ద ప్రస్తావించగా సాల్ట్ కమిషనర్, న్యూఢిల్లీ స్థాయిలో పెండింగ్‌లో ఉందని తెలిపారు.


ఉప్పు భూములు


మంటలు చెలరేగడంతో చుట్టుముట్టిన ప్రజలు

మంటలు అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బ్యాంగిల్ షాపులో అగ్నిప్రమాదం

- క్షణాల్లో చెలరేగిన మంటలు
- సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం

శ్రీకాకుళం క్రైం, జూలై 24: ఓ వైపు వర్షం.. మరోవైపు మంటలతో శ్రీకాకుళం నగర ప్రజలు ఉలిక్కి పడ్డారు. స్థానిక జీటీరోడ్డులోని పరమేశ్వరి బ్యాంగిల్స్ అండ్ ఫ్యాన్సీ స్టోర్స్ షాపులో బుధవారం మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పొగలు కమ్ముకున్నాయి. దీంతో ఊపిరాడక, ఏం జరిగిందో తెలియక.. దుకాణంలో ఉన్న వారితో పాటు చుట్టుపక్కల ఉన్న దుకాణాల్లో పని చేసే వారు రోడ్డుపైకి పరుగులు తీశారు. ఇంతలో బ్యాంగిల్ షాపులో మంటలు చెలరేగాయి. ప్రజలంతా అక్కడకు చేరుకుని మంటలు ఆపేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఏడీఎఫ్‌ఓ వరప్రసాద్ తన సిబ్బందితో అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు.

● ఇదిలా ఉండగా బ్యాంగిల్ దుకాణంలో దట్టమైన పొగలు, మంటలు చెలరేగడంతో.. ఆ బిల్డింగ్ పైఅంతస్తులోని ఓ ఈవెంట్ షాపులో ఉన్న ఇద్దరు అమ్మాయిలు ఊపిరాడక అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. వారిద్దరినీ అగ్నిమాపక సిబ్బంది సురక్షితంగా బయటకు తీసుకొచ్చి సపర్యలు చేయడంతో వారి పరిస్థితి మెరుగుపడింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల దుకాణంలో మంటలు వ్యాపించాయని అగ్నిమాపక సిబ్బంది గుర్తించారు. షాపు యజమాని వెల్లంపల్లి మణికంఠ ఫిర్యాదు మేరకు సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. అగ్నిప్రమాద ఘటన నేపథ్యంలో జీటీ రోడ్డులో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం తన సిబ్బందితో పరిస్థితిని చక్కదిద్దారు.



పూడిలంక సందర్శన

వజ్రపుకొత్తూరు మండలం పూడిలంక చుట్టూ ఉప్పునీరు చేరడంతో గ్రామం జల దిగ్బంధంలో చిక్కుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు కాలిబాట వంతెన కొట్టుకుపోయింది. దీంతో గ్రామస్థులు ఇతర అవసరాలకు బయటకు రాలేకపోయారు. అత్యవసర సేవలకు గ్రామంలో ఉన్న పడవను ఉపయోగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం కాశీబుగ్గ రూరల్ సీఐ ఈశ్వరరావు, వజ్రపుకొత్తూరు ఎస్ఐ సీహెచ్ రామారావు పోలీసు బృందంతో బుధవారం పూడిలంక గ్రామాన్ని సందర్శించారు. పడవలో గ్రామానికి చేరుకొని ప్రజలతో మాట్లాడారు. గ్రామంలో సమస్యలపై ఆరా తీశారు. అత్యవసర పరిస్థితిలో తమను సంప్రదిస్తే సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని సీఐ, ఎస్ఐ భరోసా ఇచ్చారు. ఏ ఒక్కరూ ఆందోళన చెందవద్దని తెలిపారు.

- వజ్రపుకొత్తూరు

16 ఏళ్ల తర్వాత..

- రైల్వే కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికలు

పలాస, జూలై 24: ఈస్ట్‌కోస్ రైల్వే కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికలు 16 ఏళ్ల తర్వాత నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాగా.. గురువారం సాయంత్రం వరకూ కొనసాగనున్నట్టు అధికారులు ప్రకటించారు. రైల్వే కార్మిక సంఘ నాయకులు తమ అభ్యర్థులను గెలిపించుకోవడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో ఎన్నికల కేంద్రం వద్ద కోలాహలం నెలకొంది. ఖుర్దారోడ్ డివిజన్ పరిధిలో పలాస రైల్వేస్టేషన్ ఆవరణలో మొత్తం మూడు పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మొత్తం 630 ఓటర్లకుగాను రైల్వేస్టేషన్ మేనేజర్ కార్యాలయం వద్ద రెండు, ఇంజనీరింగ్ కార్యాలయం వద్ద ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. శ్రామిక్ కాంగ్రెస్ నుంచి జె.తేజేశ్వరావు, డి.శ్యామసుందర్, ఎంఎస్.ప్రసాద్ బరిలో నిలిచారు. శ్రామిక్ యూనియన్ నుంచి ఎల్.మోహనరావు, పీవీఎస్.రావు, వీఎస్.రావు పోటీ పడుతున్నారు. ఇరు సంఘాల నుంచి మొత్తం ముగ్గురు ప్రతినిధులను ఎంపిక చేసి అర్బన్ బ్యాంకు సభ్యులుగా పంపించనున్నారు. ఈ నెల 26న జోన్ పరిధిలోని ఎన్నికల్లో గెలుపొందిన వారి వివరాలు ప్రకటిస్తారు. వీరు ఉద్యోగులకు సహాయకారులుగా వ్యవహరిస్తారు.


ఓటు వేసేందుకు క్యూలో ఉన్న రైల్వే ఉద్యోగులు



ముందుకొచ్చిన సముద్రం

కవిటి మండలంలోని తీరప్రాంతంలో సముద్రం కొన్ని మీటర్ల మేర ముందుకొచ్చింది. తీరం కోతకు గురైంది. తుఫాన్ నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో సముద్రం అల్లకల్లోలంగా ఉందని మత్స్యకారులు తెలిపారు. కొత్తపాలెం, పుక్కళ్లపాలెం, చిన్నకర్రివానిపాలెం గ్రామాల వద్ద తీరంలోని ఇసుక దిబ్బలు కోతకు గురయ్యాయని పేర్కొన్నారు. సముద్ర కెరటాలు ముందుకొచ్చి తీరాన్ని తాకుతుండడంతో.. వలలు, తెప్పలు భద్రపరుచుకున్నామని తెలిపారు.

- కవిటి



ప్యారిస్ వేదికగా శుక్రవారం నుంచి ఒలింపిక్స్ జరుగుతున్న నేపథ్యంలో మెగాస్టార్ చిరంజీవి కుటుంబ సమేతంగా లండన్ చేరుకున్నారు. అక్కడున్న హైడ్ పార్క్‌లో రామ్‌చరణ్, ఉపాసన, మనవరాలు క్లీంకారాతో ప్రకృతిని ఆస్వాదిస్తున్న ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. గురువారం మెగా కుటుంబం పారిస్ వెళుతుంది.

గుర్తుండిపోయే పాత్ర



సందీప్ కిషన్ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'రాయన్'. తమిళ నటుడు ధనుశ్ స్వీయ దర్శకత్వంలో ఇది తెరకెక్కింది. కళానిధి మారన్ నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా సందీప్ కిషన్ మీడియాతో ముచ్చటించారు.

"ఇది ధనుశ్ నటించిన 50వ చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. అందుకే తగ్గట్లే ఆయన ప్రతీ విషయంలో జాగ్రత్త పడ్డారు. అద్భుతమైన స్ర్కీన్‌ప్లేతో నడిచే ఈ సినిమాలో ప్రతీ సన్నివేశం కొత్తగా ఉంటుంది. ఇందులో నేను పోషించిన పాత్ర చాలా కీలకం. నా కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర ఇది. సినిమాలో యాక్షన్ మాత్రమే కాకుండా మనసుకు హత్తుకునే భావోద్వేగాలు, అందరినీ అలరించే వినోదం ఉంటుంది. ఇది 'రాయన్' అనే ఇంటిపేరు గల ఓ ఫ్యామిలీతో ముడిపడిన కథ. సినిమాలో వచ్చే ప్రతీ పోరాట ఘట్టం ప్రత్యేకంగా ఉంటుంది. సినిమా చూసే ప్రేక్షకులు కొత్త అనుభూతికి లోనవుతారు. ఏ.ఆర్. రెహమాన్ అందించిన పాటలు సినిమాకు అదనపు ఆకర్షణ" అని చెప్పారు.

అంతర్యుద్ధాన్ని ఆవిష్కరించేలా...



'పలాస 1978', 'నరకాసుర' చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్న రక్షిత్ అట్లూరి నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. వెంకట సత్య దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ న్యూ ఏజ్ సస్పెన్స్ థ్రిల్లర్‌ను ధ్యాన్ అట్లూరి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా రక్షిత్ అట్లూరి మీడియాతో ముచ్చటించారు.

"ఇది కొత్తతరానికి బాగా చేరువయ్యే థ్రిల్లర్. నాన్న వెంకట సత్యకు దర్శకుడిగా ఇది తొలి సినిమా అయినా ఎక్కడా తడబడలేదు. ఈ సినిమా ప్రతీ మనిషిలో జరిగే ఆలోచనల అంతర్యుద్ధాన్ని కొత్తగా ఆవిష్కరిస్తుంది. ఇందులో నేను ఆనంద్ శ్రీరామ్ అనే టీవీ రిపోర్టర్ పాత్రలో కనిపిస్తాను. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ సినిమాలో ఓ విభిన్నమైన ప్రేమ కథ కూడా ఉంటుంది. ఈ సినిమా ఒక మనిషి ఎలా సైకోగా మారతాడో విజువల్‌గా చూపిస్తుంది. థియేటర్లలో సినిమా చూసే ప్రేక్షకులు తమ టికెట్‌కు వంద శాతం న్యాయం జరిగిందని భావిస్తారు" అని చెప్పారు.



బెల్లంకొండ... కొత్త కబురు

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా కొత్త చిత్రం ఖరారైంది. 'బీఎస్ఎస్ 12' వర్కింగ్ టైటిల్. లుధీర్ బైరెడ్డి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. మహేశ్ చందు నిర్మిస్తున్నారు. 400 ఏళ్ల నాటి గుడి నేపథ్యంలో కల్ట్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోందని నిర్మాతలు తెలిపారు. లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శివేంద్ర, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్ ఆర్.

హీరోగా రాజ్‌తరుణ్ అందుకే



రాజ్‌తరుణ్, హాసిని జంటగా నటించిన చిత్రం 'పురుషోత్తముడు'. రామ్ భీమన దర్శకత్వంలో డా.రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా దర్శకుడు రామ్‌భీమన, నిర్మాత డా.రమేశ్ తేజావత్, హీరోయిన్ హాసిని మీడియాతో ముచ్చటించారు. దర్శకుడు రామ్‌భీమన మాట్లాడుతూ "మా బడ్జెట్‌కు తగ్గ హీరో కోసం అన్వేషిస్తున్న క్రమంలో రాజ్‌తరుణ్ అయితే అన్ని విధాలా బావుంటుందనిపించింది. అందుకే ఆయన్ను హీరోగా తీసుకున్నాం" అని చెప్పారు. నిర్మాత డా. రమేశ్ తేజావత్ మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ అలరిస్తుంది. కుటుంబమంతా కలసి చూసేలా సినిమాను రూపొందించాం. ప్రతీ సన్నివేశాన్ని ఎంతో క్వాలిటీతో తెరకెక్కించాము" అని తెలిపారు. హీరోయిన్ హాసిని మాట్లాడుతూ "ఇందులో నాకు, రాజ్ తరుణ్‌కు మధ్య వచ్చే లవ్‌ట్రాక్ అద్భుతంగా ఉంది. నేను పోషించిన పాత్ర అందరికీ నచ్చుతుంది. సినిమాలో ఏడు పాటలున్నాయి. వేటికవే ప్రత్యేకంగా ఉండే ఆ పాటలు తెరపై ప్రేక్షకులకు మంచి అనుభూతిని ఇస్తాయి" అని చెప్పారు.

పాటల రేవులో సాహితీ సంగమం



మత్స్యకారుల జీవితాలను ఆవిష్కరించే ఇతివృత్తంతో రూపుదిద్దుకున్న చిత్రం 'రేవు' అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఆగస్టు రెండో వారంలో విడుదల కోసం సిద్ధమైంది. ఈ సినిమా ఆడియో వేడుక బుధవారం ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగింది. ఐదుగురు ప్రముఖ గీతరచయితలు చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి, సుద్దాల అశోక్‌తేజ, అనంత్ శ్రీరామ్, కాసర్ల శ్యామ్ ముఖ్య అతిథులుగా ఈ వేడుకలో పాల్గొనడం ఒక విశేషమైతే, చాలా ఏళ్ల తర్వాత క్యాసెట్ రూపంలో ఈ ఆడియోను విడుదల చేయడం మరో విశేషం. గీత రచయిత చంద్రబోస్ మాట్లాడుతూ 'నవ్యత, నాణ్యత ఈ చిత్రంలో కనిపించాయి. సినిమా విజయం సాధించాలి' అని కోరారు. 'కంటెంట్ ఉన్న వైవిధ్యమైన సినిమాలు రావాలంటే పర భాషల వైపు చూస్తుంటాం. కానీ 'రేవు' సినిమా పాటలు విన్నాక కొత్తతరం ప్రతిభావంతులపై నమ్మకం ఏర్పడుతోంది' అన్నారు రామజోగయ్య శాస్త్రి. తనలాగానే గీత రచయిత ఇమ్రాన్ శాస్త్రి మొదటి సినిమాకే సింగిల్ కార్డ్ పొందారని అనంత శ్రీరామ్ అభినందించారు. అక్షరాలన్నీ కలసినట్లుగా ఈ వేదిక ఉందని సుద్దాల అశోక్‌తేజ అభినందించారు. 'రేవు' చిత్ర నిర్మాణ పర్యవేక్షకుడు ప్రభు మాట్లాడుతూ 'ఒక చిన్న సినిమాను సపోర్ట్ చేయడానికి ఇంతమంది గీత రచయితలు రావడం ఆనందంగా ఉంది. దర్శకుడు హరనాథ్ మత్స్యకారుల జీవన పోరాటాన్ని అద్భుతంగా తెరకు ఎక్కించారు' అని చెప్పారు. ఎగ్జిక్యూటివ్ నిర్మాత పర్వతనేని రాంబాబు మాట్లాడుతూ 'ఈ చిత్ర నిర్మాతలు, మిత్రులు మురళీ గింజుపల్లి,నవీన్ పారుపల్లి నా మీద ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. వారి నమ్మకాన్ని నిలబెట్టాలా 'రేవు' సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకెళతాం' అని చెప్పారు.

సూపర్ నేచురల్ థ్రిల్లర్



అనసూయ, జగపతిబాబు ప్రధాన పాత్రలు పోషించిన 'సింబా' చిత్రం ఆగస్టు 9న విడుదల కానుంది. మురళీ మనోహర్ దర్శకత్వంలో దాసిరి రాజేంద్రరెడ్డి నిర్మించిన చిత్రమిది. బుధవారం ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అనసూయ మాట్లాడుతూ ' చాలా మంచి కాన్సెప్ట్‌తో 'సింబా' రూపుదిద్దుకుంది. జగపతిబాబు ఈ చిత్రానికి ప్రధాన బలం' అన్నారు. 'మా సినిమాకు కథే హీరో. ప్రకృతిని జాగ్రత్తగా కాపాడుకోండి. ముందు తరాల గురించి ఆలోచించండి... అని చెబుతున్నాం' అన్నారు నిర్మాత రాజేందర్‌రెడ్డి. సూపర్ నేచురల్ థ్రిల్లర్ ఇదనీ, ఇంతవరకూ ఇండియన్ స్ర్కీన్ మీద ఇలాంటి కాన్సెప్ట్ రాలేదని దర్శకుడు మురళీ మనోహర్ చెప్పారు. ఈ సినిమాకు కథ, స్ర్కీన్‌ప్లే అందించిన సంపత్ నందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆగస్టులో డిమోంటీ కాలనీ 2



అరుళ్ నిధి, ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన తమిళ చిత్రం 'డిమోంటి కాలనీ 2'. బ్లాక్‌బస్టర్ హారర్ థ్రిల్లర్ 'డిమోంటి కాలనీ' చిత్రానికి ఇది సీక్వెల్. రాజ్‌వర్మ ఎంటర్‌టైన్‌మెంట్, శ్రీ బాలాజీ ఫిలింస్ తెలుగులో విడుదల చేస్తోంది. అజయ్ ఆర్ జ్ఞానముత్తు దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఆగస్టులో ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ చిత్రానికి సంగీతం: శామ్ సీఎస్, సినిమాటోగ్రఫీ: హరీశ్ కన్నన్

చిరంజీవి పుట్టిన రోజున



బండి సరోజ్‌కుమార్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'పరాక్రమం'. శ్రుతీ సమన్వి, మోహన్ సేనాపతి కీలకపాత్రలు పోషించారు. ఆగస్టు 22న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ టీజర్‌ను విడుదల చేసింది. చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఆగస్టు 22న 'పరాక్రమం' చిత్రాన్ని విడుదల చేస్తున్నామని సరోజ్‌కుమార్ చెప్పారు.



దర్శకుడు మారుతి సమర్పణలో భారీ మ్యూజికల్ ఈవెంట్ 'జామ్‌జంక్షన్' సెప్టెంబర్ 6న హైటెక్స్ గ్రౌండ్‌లో జరగనుంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో సంగీత దర్శకుడు తమన్, నిర్మాత ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.

అనాథల కథ



సంజయ్ శ్రీరాజ్, ప్రియ శ్రీనివాస్, భరత్ మహాన్, రితిక ప్రధాన పాత్రలు పోషించిన 'గల్లీ గ్యాంగ్ స్టార్స్' చిత్రం ఈ నెల 26న విడుదల కానుంది. అనాథల బాధ్యత సమాజం తీసుకోకపోతే చాలా దారుణాలు ఎదుర్కోవలసి వస్తుంది అనే ఇతివృత్తంతో రూపొందిన ఈ చిత్రాన్ని ధర్మ దర్శకత్వంలో డాక్టర్ అరవేటి యశోవర్ధన్ నిర్మించారు. ఎన్నో అవరోధాలను అధిగమించి, చిత్రాన్ని పూర్తి చేసి విడుదల చేస్తున్నామని నిర్మాత చెప్పారు.

వీటిని రోడ్లంటారా?

- వైసీపీ ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యం
- భారీ వర్షాలతో మరింత దారుణంగా..
- ఇదీ పలు గ్రామాల్లోని రహదారుల తీరు

చిత్రాలను చూస్తున్నారుగా.. ఇవి జిల్లాలోని పలు గ్రామాల రహదారులు.. ఇలా దారుణంగా తయారుకావడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రోడ్లు గ్రావెల్ రోడ్లు కాగా, మరికొన్ని బీటీ రహదారులు. వైసీపీ ప్రభుత్వంలో మరమ్మతులకు నోచుకోకపోవడంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్ద గోతులుగా మారి రాళ్లు తేలి ప్రమాదాలను ఆహ్వానిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు ఆందోళనకు గురవుతున్నారు. వీటిని రోడ్లంటారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వివిధ రోడ్ల దుస్థితి ఇలా..

చెరువును తలపిస్తూ..

నందిగాం: వల్లభరాయుడుపాడు నుంచి పాతటెక్కలి వెళ్లే గ్రావెల్ రోడ్డుపై గోతులు ఏర్పడి వర్షపు నీరు నిలిచిపోవడంతో చెరువును తలపిస్తోంది. దీంతో వాహనచోదకులు, పాద చారులు నరకయాతన పడుతున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.


వల్లభరాయుడుపాడు-పాతటెక్కలి గ్రావెల్ రోడ్డు ఇలా..

రాళ్లు తేలి.. అధ్వానమై..


రాళ్లు తేలిన అంబటికంబారం రోడ్డు

హరిపురం: మందస నుంచి చీపి మీదుగా చిన్నకోష్ఠ, పెద్దకేసుపురం, చిన్నకేసుపురం, బహాడపల్లి నుంచి గుణుపల్లి రహదారి, కొండలోగాం రోడ్డు గతంలో కురిసిన వర్షాలకు దెబ్బ తిన్నాయి. గత ఐదేళ్లుగా కనీసం మరమ్మతులకు నోచుకోకపోవడంతో రాళ్లుతేలి, మట్టి రోడ్లుగా తయారయ్యాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు.

సరిహద్దు ప్రయాణం గండమే..

మెళియాపుట్టి: సరిహద్దు ప్రయాణం దినదిన గండంగా తయారైందన్న ఆవేదన పలు వురు వాహనచోదకుల్లో వ్యక్తమవుతోంది. ప్రతిరోజూ వేలాది వాహనాల రాకపోకలు సాగించే పర్లాకిమిడి-పలాస రోడ్డు గతుకులమయంగా తయారైంది. ఒడిశాలోని పర్లాకిమిడి నుంచి దవిడిగాం వరకు జాతీయరహదారికి మించి రోడ్డు ఉండగా ఆంధ్రాలో అడుగు పెడితే మాత్రం భయంభయంగానే ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు. ఈ మార్గంలో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. గడచిన ఐదేళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడం, వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో మరింత దారుణంగా తయారైంది. మహేంద్రతనయ వంతెనపై గోతులు ఏర్పడడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రూ.15 లక్షల మెయింటి నెన్స్ నిధులు వెచ్చించినప్పటికీ గోతులు మాత్రం కనిపిస్తూనే ఉన్నాయి. అలాగే పలు గ్రామాల రహదారులు దారుణంగా ఉన్నాయి. ఆర్ అండ్‌బీ జేఈ బి.గోపాలరావు వద్ద ప్రస్తావించగా ప్రస్తుతం నాలు గు కిలో మీటర్లకు సంబంధించి రూ.10 లక్షల అంచనా వ్యయంతో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.


కొసమాళ వద్ద చెరువును తలపిస్తున్న బీటీ రోడ్డు


మహేంద్రతనయ వంతెనపై గోతులేర్పడిన దృశ్యం

అధికారులపై దాడి కేసులో ముగ్గురికి జైలుశిక్ష

పలాసరూరల్, జూలై 24: అధికారులపై దాడి చేసిన కేసులో ముగ్గురికి పలాస జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి యు.మాధురి ఆరు నెలల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చినట్లు కాశీబుగ్గ సీఐ విజయకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివ రాలిలా ఉన్నాయి.. పలాస మండలం రేగులపాడులో ఆఫ్‌షోర్ రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా 2017లో నిర్వాసితులకు పునరావాస కాలనీ నిర్మించేందుకు 50 ఎకరాల స్థలం టెక్కలిపట్నం పరిసర ప్రాంతంలో కేటాయించారు. స్థలాన్ని పరిశీలించేందుకు అప్పటి వీఆర్వో, సర్వేయర్లు వెళ్లగా టెక్కలిపట్నం, కమలాపురానికి చెందిన రైతులు వారిని అడ్డుకుని దాడి చేశారు. దీనిపై అప్పటి తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. ఈ ఘటనపై ఏపీపీ పి.రమేష్ వాదించారు. తుది విచారణ చేసిన న్యాయాధికారి మాధురి టెక్కలి పట్నంనకు చెందిన నంద కుమార్, జోగ పార్వతి, కమలాపురానికి చెందిన మద్దు రంగారావులను ముద్దాయిలుగా నిర్ధారిస్తూ.. వీరికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు సీఐ విజయకుమార్ తెలిపారు.

నూతన నిర్మాణ పద్ధతులపై అవగాహన ఉండాలి

పలాస: నూతన భవన నిర్మాణ పద్ధతులపై లైసెన్స్ టెక్నికల్ పర్సన్లు అవగాహన కలిగి ఉండాలని సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎన్.జగదీశ్వరరావు, పలా స అధ్యక్షుడు ఊణ్ణ వెంకటరావు అన్నారు. బుధవారం కేటీ రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారు తున్న కాలానికి అనుగుణంగా ఇంజనీరింగ్ పద్ధతులను మార్చాలని, భవనాలు, ఇతర నిర్మా ణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేందుకు నాణ్యమైన సామగ్రిని కొనుగోలు చేయా లన్నారు. సిమెంట్, ఐరన్ తదితర వస్తువులు ఐఎస్ఐ మార్కు ఉన్నవే కొనుగోలు చేసి నిర్మాణ దారులకు నష్టం లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో బెల్లాల వెంకటరావు, టొక్క కృష్ణారావు, శాసనపురి సందీప్, దుంగ జగదీష్, ఎంఎస్.విజయ్‌కుమార్, వాసు, జిల్లాలోని మున్సిపల్ టెక్నికల్ పర్సన్లు, ప్రైవేటు ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతూ హెచ్‌సీ మృతి

జలుమూరు/శ్రీకాకుళం క్రైం: జలుమూరులో హెచ్‌సీగా పనిచేస్తున్న కె.ఉమామహేశ్వరరావు (51) బుధవారం తెల్లవారు జామున మృతి చెందారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ కె.మధుసూదనరావు తెలిపారు. ఇతనికి భార్య ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. హెచ్‌సీ మృతి పట్ల నరసన్నపేట సీఐ బి.ప్రసాదరావుతో పాటు ఎస్ఐ, సిబ్బంది సం తాపం తెలిపారు. ఇదిలా ఉండగా డెత్ రిలీఫ్ ఫండ్ కింద మృతుడి కుటుంబానికి ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అసోసియేషన్ తరఫున రూ.లక్ష నగదును సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రోణంకి కృష్ణంనాయుడు, కె.భుజంగరావు అందజేశారు. కార్యక్రమంలో సభ్యురాలు జగదాంబ, రాష్ట్ర సంఘం సహాయ కార్యదర్శి కె.రాధాకృష్ణ, మహిళా ఉపాధ్యక్షురాలు అరుణకుమారి, మాజీ అధ్యక్షుడు కెల్లి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.


ఉమామహేశ్వరరావు (ఫైల్)

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలాస: చిన్నబడాం 11కేవీ విద్యుత్ ఫీడరు పరిధిలో చెట్లు కటింగ్ చేయనున్నందున శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్‌శాఖ ఈఈ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా జీఎంఆ కాలనీ, ఆర్కేపురం, పెంటిభద్ర, జేఆర్పీ పురం, చిన్నబడాం, పద్మనాభపురం కాలనీ, నీలాపురం, తాళభద్ర, నర్సిపురం, అంతరకుడ్డ, పెసరపాడు, పాత జాతీయ రహదారి, రాజపురం, కోసంగిపురం తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

లింగాలవలస ఫీడర్‌లో..

టెక్కలి: లింగాలవలస ఫీడర్ 11కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో ఉద యం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జి.శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతాపురం, తిర్లంగి, పోలవరం, పెద్దసాన, లింగాలవలస గ్రామాలకు విద్యుత్ సౌకర్యం ఉండదన్నారు.

చల్లవానిపేట సబ్ స్టేషన్ పరిధిలో..

జలుమూరు: చల్లవానిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని తిమడాం ఫీడర్‌పై గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు టెక్కలి ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురం వద్ద గల తాగునీటి ప్రాజెక్టు ఫీడర్‌పై మరమ్మతులు చేపట్టి, చెట్లు కొమ్మలు తొలగించనున్నందున ఉదయం 8 గంటల నుంచి మధాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. దీంతో శ్రీముఖలింగం, తిమడాం, పర్లాం, మాకివలస, అచ్యుతాపురం, బైదలాపురం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలన్నారు.

ఉర్లాం పాఠశాల ఉపాధ్యాయుల తీరుపై విచారణ

నరసన్నపేట: ఉర్లాం ప్లస్ టూ పాఠశాలలో విద్యార్థినుల ఫిర్యాదు మేరకు బుధవారం టెక్కలి డిప్యూటీ డీఈవో పి.విలియమ్స్, జీసీడీవో నీరజ బుధవారం ఉపాధ్యాయులను విచారించారు. గతేడాది విద్యార్థినులపై ఒక ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తిం చిన తీరుపై విద్యాశాఖాధికారులకు ఇచ్చిన ఫిర్యాదుతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం పాఠశాలలో అంతర్గత విచారణ చేపట్టారు. సదరు ఉపాధ్యాయుడితో పాటు అతడిని సమర్థించిన మరో ఇద్దరు ఉపాధ్యాయులను విచారించామని, నివేదికను ఉన్నతాధి కారులకు అందిస్తామని డిప్యూటీ డీఈవో విలియమ్స్ తెలిపారు.

మందసలో 108 సేవల పరిశీలన

మందస: మందసలో బుధవారం 108 సేవలను ఆపరేషన్ అధికారి గండేపల్లి జగన్నాథరావు పరిశీలించారు. వాహనాల నిర్వహణ, రికార్డులు, డ్యూటీ చార్ట్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో 108 సిబ్బంది శంకరరావు, వి.మురళీమోహన్ పాల్గొన్నారు.

కొత్తూరుకు కోల్డ్ స్టోరేజిని మంజూరు చేయాలి

- మంత్రి అచ్చెన్నను కోరిన ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్.ఎన్.పేట/పాతపట్నం: కొత్తూరుకు కూరగాయలు ఉంచేందుకు కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు బుధవారం అమరావతిలో మార్కెటింగ్ శాఖా మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. అలాగే పాతపట్నంలో రైతుబజార్ ఏర్పాటుకు సహకరించాలని కోరారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.



గ్రామంలో జ్వరపీడితులున్నా తెలియదా?

- వైద్యాధికారిని ప్రశ్నించిన జడ్పీటీసీ బుచ్చిబాబు

హిరమండలం: గులుమూరు గ్రామంలో ఎక్కువ మంది జ్వరాలతో బాధ పడుతున్నా ఎందుకు వైద్యులు, సిబ్బంది స్పందించలేదని జడ్పీటీసీ పోగిరి బుచ్చిబాబు ప్రశ్నించారు. బుధవారం ఆయన చొర్లంగి పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో జ్వరాల విషయమై వైద్యాధికారి యశ్వంత్ దృష్టికి తీసుకువెళ్లగా.. తమకు తెలియదని ఆయన సమాధానం ఇవ్వడంపై జడ్పీటీసీ అసంతృప్తి వ్యక్తంచేశారు. తక్షణం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని వైద్యాధికారికి సూచించారు.


వైద్యాధికారిని ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బుచ్చిబాబు

భూముల్లోకి వెళ్లి తగాదాలు పడొద్దు

- టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి

జలుమూరు: మాకివలస భూములపై హక్కులు ఎవరికి ఉన్నాయో రెవెన్యూ అధికారులు తెలిపేవరకు ఎవరూ ఆ భూముల్లోకి వెళ్లి తగాదాలు పడవద్దని టెక్కలి డీఎస్పీ కె.బాలచంద్రారెడ్డి అన్నారు. మాకివలస భూములపై తప్పుడు పత్రాలు సృష్టించి విక్రయించారని పేర్కొంటూ ఎల్ఎన్‌పేట మండలానికి చెందిన ఊణ్ణ సత్యనారాయణ గుప్తపై ఎస్టీ కమిషన్‌కు స్థానిక గిరిజనులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కమిషన్ ఆదేశాల మేరకు డీఎస్పీ బుధవారం ఇరువర్గాలను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి చర్చించారు. ఈ భూములపై రికార్డుల పరంగా హక్కులు ఎవరికి ఉన్నాయో తెలియజేయాలని తహసీల్దార్‌కు, ఆర్డీవోకు లేఖలు రాయాలని ఎస్ఐకి సూచించారు. రెవెన్యూ అధికారుల నుంచి ఆదేశాలు వచ్చే వరకు ఇరువర్గాలు ఆ భూములపైకి వెళ్లకూడదని సూచించారు. ఎవరైనా తొందరపడి భూములపైకి వెళితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్.ఐ కె.మధుసూదనరావు ఉన్నారు.


మాకివలస గిరిజనులతో మాట్లాడుతున్న టెక్కలి డీఎస్పీ కె.బాలచంద్రారెడ్డి

లెక్చరర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు

పలాస: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణితం, కామర్స్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకుల నియమకానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి ఒక ప్రకటనలో కోరారు. అభ్యర్థులు ఆయా సబ్జెక్టుల్లో పీజీలో 55 శాతం మార్కులు ఉండాలని, స్లెట్, నెట్, ఏపీసెట్,పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుంద న్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 30న కళాశాలలో ఉదయం 10 గంటల నుంచి నిర్వహించ నున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు.

శాఖాగ్రంథాలయంలో 'అయ్యంకి' జయంతి

టెక్కలి: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతిని బుధవారం స్థానిక శాఖాగ్రంథాలయంలో నిర్వహించారు. అయ్యంకి చిత్రపటానికి గ్రంథాలయాధికారి బి.రూపావతి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ ఉద్యమంలో ఆయన విశేషంగా కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సాంబమూర్తి, నాగభూషణం, గవిరేసు తదితరులు పాల్గొన్నారు.


పలాస రూరల్: అయ్యంకి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీఆర్పీలు, విద్యార్థులు

- **పలాసరూరల్:** గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి వెంకటరమణయ్య చేసిన సేవలు అజరామరమని గ్రంథాలయాధికారి వై.రాంబాబు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం గ్రంథాలయోద్యమకర్త అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతి ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమం లో సీఆర్పీ లు శేషగిరి, అప్పలరాజు, పాఠకులు, యువత, విద్యార్థులు పాల్గొన్నారు.
- **పాతపట్నం:** గ్రంథాలయ ఉద్యమపితామహుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, పద్మశ్రీ అయ్యంకి వెంకటరమణయ్య జయంతిని స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయాధికారి కొళ్ల రాజు, హౌసింగ్ ఏఈ పీవీ జోగారావు, జీఎంఎస్ డెప్యూటీ జనరల్ మేనేజర్ బి.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.
- **మెళియాపుట్టి:** స్థానిక శాఖాగ్రంథాలయంలో జాతీయ గ్రంథాయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 134వ జయంతిని బుధవారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. ఆయన సేవా విశిష్టతలను వివరించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారితో పాటు ప్రిన్సిపాల్ గాయత్రి తదితరులు పాల్గొన్నారు.

'శిక్షా సాప్తాహ్'లో క్రీడా పోటీలు

పలాసరూరల్: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో చేపడుతున్న 'శిక్షా సప్తాహ్'లో భాగంగా బుధవారం క్రీడా పోటీలు నిర్వహించారు. పలాస మండలం బొడ్డపాడు జడ్పీ హైస్కూల్‌లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, 6, 7 తరగతుల విద్యార్థులకు లెమన్ అండ్ స్పూన్ పోటీలు స్పూన్‌లెమన్ పోటీలు నిర్వహించారు. విజేతలకు చివరిరోజు బహుమతులు అందజేయడం జరుగుతుందని హెచ్‌ఎం వీర్రాజు, పీడీ రాంజీ తెలిపారు.

- **మందస:** శిక్షా సప్తాహ్ కార్యక్రమాల్లో భాగంగా మందస జడ్పీ హైస్కూల్‌లో బుధవారం క్రీడా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జె.రవికుమార్, ఉపాధ్యాయులు తిరుపతి, మురళీ, ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.
- **నందిగాం:** జాతీయ విద్యావిధానంలో భాగంగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని బుధవారం పాఠశాలల్లో సంప్రదాయ క్రీడలు నిర్వహించారు. గోలీఆట, కబడ్డీ, కుంటాట తదితర పోటీలు నిర్వహించారు.

వనిత మండలం-గార వంతెన పనులు పూర్తి చేయాలి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి



నరసన్నపేట: నరసన్నపేట నియోజవర్గంలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వనిత మండలం-గార వంతెన పనులు 64 శాతం పూర్తయ్యాయని, మిగిలిన పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు. బుధవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో బగ్గు వంతెన సమస్యను ప్రస్తావించారు. రోడ్ల అభివృద్ధికి గతంలో టీడీపీ ప్రభుత్వం రూ.11,450 కోట్లు ఖర్చు పెట్టి అధిక ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. సుమారు 60 శాతానికి పైగా టీడీపీ పూర్తి చేసిన పనులపై వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింద న్నారు. ఆమదాలవలస రైల్వే స్టేషన్ నుంచి శ్రీకాకుళం కేంద్రం రావాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. ఏ రోజున ఏ ప్రమాదం జరిగి ఎవరు చనిపోతారో తెలి యని పరిస్థితి నెలకొందన్నారు. అర్థంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులను పూర్తి చేయాలని ఆయన కోరారు.

మంత్రి అచ్చెన్న దృష్టికి జిల్లా కేంద్ర ఆసుపత్రి సమస్యలు

- ఆసుపత్రిని పరిశీలించిన టీడీపీ నేతలు

టెక్కలి: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు టీడీపీ ప్రతినిధులు బుధ వారం జిల్లా కేంద్ర ఆసుపత్రిని సందర్శించి సమస్యలను పరిశీలించి వాస్తవ స్థితిగతులను గుర్తించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరిరావు ఆధ్వర్యంలో నేతలు ఆసుపత్రిలోని ప్రతి విభాగం పరిశీలించారు. రోగులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోగులు, వారి సహాయకులు కూర్చునేం దుకు, గర్భిణులు కూర్చునేందుకు కుర్చీలు కూడా లేవని గుర్తించారు. చిరిగిన బెడ్లు, పాడైన వీల్ చైర్లు, స్ట్రక్చర్లను పరిశీలించారు. మూలకు చేరిన ఆర్వో ప్లాంట్, వాటర్ కూలర్ ప్లాంట్‌ను పరిశీలించి ఆశ్చర్యం వ్యక్తంచేశారు. ఎక్స్‌రే విభాగం లో రేడియాలజిస్టులు, డార్క్‌రూమ్ అసిస్టెంట్లు, ఎయిడ్స్ విభా గంలో ఫార్మా సిస్టులు కొరత, గర్భిణులకు థైరాయిడ్ టెస్ట్, ఇతర టెస్ట్‌లు లేకపోవడం, ల్యాబ్‌లో సామాగ్రి కొరత, అరకొర వైద్యులు, వైద్య సిబ్బంది, మొరాయిస్తున్న జనరేటర్, పని చేయని ప్రాణ వాయువు యూనిట్, ఆసుపత్రి బయట పారి శుధ్య లోపాలను గుర్తించారు. ఈ సందర్భంగా శేషగిరిరావు మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని సమస్యలను మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళతామన్నారు. కార్యక్రమంలో నేతలు మెండ దమయంతి, కోళ్ల లవకుమార్, పోలాకి షణ్ముఖరావు, ప్రసాద్ రెడ్డి, రెయ్యి ప్రీతీష్, మధు, ప్రఫుల్లా, రాజారావు, చంద్రరావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


చిరిగిన బెడ్లను చూస్తున్న టీడీపీ ప్రతినిధులు

ప్రతీ కౌలు రైతుకు రుణాలివ్వాలి

నరసన్నపేట: ప్రతీ కౌలు రైతుకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని లీడ్ బ్యాంక్ మేనేజర్ సూర్యకిరణ్ సూచించారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో బ్యాంకర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో 10 వేల వరకు కౌలు రైతులున్నారని, వారికి ఎకరాకు కనీసం రూ.20 వేలు రుణం ఇవ్వాలన్నారు. గతేడాది కేవలం రూ.10 కోట్లు మాత్రమే కౌలు రైతులకు రుణాలివ్వడం జరిగిందని. ఈఏడాది కనీసం రూ.50 కోట్ల వరకు ఇవ్వాలన్నారు. గతేడాది చేపట్టిన సమగ్ర భూసర్వేతో 1బీ పత్రాలు రావడంలేదనే ఈ విషయాన్ని బ్యాంకర్ల గుర్తించి రైతుల భూహక్కు పత్రాల ఆధారంగా రుణాలను రెన్యూవల్ చేయాలని కోరారు. స్వయంశక్తి సంఘాలకు గ్రూపు రుణాలతో పాటు వ్యక్తిగత రుణాలు కూడా ఇవ్వాలన్నారు. కార్యాక్రమంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరెడ్డి, ఆర్ సెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, నారాయణరావు, ఏసీ కొండలరావు, ఏపీఎంలు సాయిలక్ష్మి, గోవిందరావు, రాజారావు, డీసీసీబీ, యూనియన్ బ్యాంకు, ఎస్‌వీజీబీ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లీడ్ బ్యాంకు మేనేజర్ సూర్యకిరణ్

ఉప్పునీరు చేరిన పంట పొలాల పరిశీలన

వజ్రపుకొత్తూరు: ఇటీవల కురిసిన వర్షాలకు నువ్వలరేవు చుట్టూ ఉన్న ఉప్పుటేరు ఉప్పొంగి పొలాల్లోకి చేరడంతో పంటలు పాడయ్యాయని, స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయాధికారుల బృందం బుధవారం సదరు పొలాలను పరిశీలించింది. ఉప్పునీరు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే వరి పంటపై ప్రభావం లేకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారులు కిరణ్‌వాణి, జ్యోత్స్న, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అర్సవెల్లి ఉమామహేశ్వరరావు, నెయ్యిల సూర్యనారాయణ, కుత్తుం కృష్ణ, హేమసుందరరావు, శేషు పాల్గొన్నారు.


పంటపొలాలను పరిశీలిస్తున్న అధికారులు

కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసీలకు అన్యాయం

మందస: కేంద్ర బడ్జెట్‌లో ఆదివాసీలకు తీరని అన్యాయం జరిగిందని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సురేంద్ర అన్నారు. మందసలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్రబడ్జెట్‌లో ఆదివాసీలకు రూ.13 వేల కోట్లు కేటాయించామని, గత బడ్జెట్ కన్నా 4.5 శాతం అధికమని ఆర్థిక మంత్రి ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆదివాసీ జనాభా ప్రాతిపదికన 83 శాతం కేటాయించాల్సి ఉండగా బడ్జెట్‌లో ఆ స్థాయిలో కేటాయింపు లేదన్నారు. సమావేశంలో గిరిజన సంఘ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎస్.అప్పన్న, ధర్మారావు, సవర గురునాథ్, జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

సాగర మత్స్యకారులను విస్మరించారు

సంతబొమ్మాళి: కేంద్ర బడ్జెట్‌లో సాగర మత్స్యకారులకు అన్యాయం జరిగిందని టీడీపీ మండల నాయకులు సూరాడ ధనరాజ్, వారాధి చంటి అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో ఆక్వా సాగుకు రాయితీలిచ్చారని, అయితే ఆక్వా సాగు చేస్తున్న రైతుల్లో ఎక్కువ మంది భూ స్వాములేనన్నారు. జీవన మనుగడకు అలల తాకిడిని ఎదుర్కొంటూ వేట సాగిస్తున్న మత్స్యకారులకు బీమా గాని, వలలు, బోట్లపై రాయితీలు గాని కేంద్ర బడ్జెట్‌లో ఇవ్వలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారులను విస్మరించారన్నారు.

ఆదాయం ఘనం.. అభివృద్ధి శూన్యం



అభివృద్ధికి నోచుకోని కంచిలి రైల్వే స్టేషన్

- డిజిటల్ బోర్డులు లేక ప్రయాణికుల అవస్థలు
- కంచిలి రైల్వేస్టేషన్‌లో అధ్వాన పరిస్థితి

(కంచిలి)

కంచిలి రైల్వేస్టేషన్‌లో సమస్యలు పాగావేశాయి. టికెట్ల రూపంలో ఆదాయం బాగానే ఉన్నా, స్టేషన్ అభివృద్ధికి నోచుకోలేదన్న విమర్శలొస్తున్నాయి. ప్రధానంగా ఇక్కడ డిజిటల్ బోర్డులు లేకపోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు.స్టేషన్‌లో సమస్యలు రైల్వేఅధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్తున్నా పరిష్కారంకావడంలేదని ఉద్దానంలోని పలు వురు వాపోతున్నారు.

ఇదీ పరిస్థితి

ఉద్దానంలోని పలు ప్రాంతాల నుంచి నిత్యం సోంపేట (కంచిలి ఆర్ఎస్) రైల్వే స్టేషన్ నుంచి విశాఖపట్నం, హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, అహ్మదాబాద్ తదితర ప్రాంతాలకు నిత్యం వందలాది మంది ప్రయాణిస్తుంటారు. ఖుర్దా డివిజన్ పరిధిలో శివారున ఉన్న కంచిలి రైల్వేస్టేషన్ నుంచి రైల్వే శాఖకు ఆదాయం ఎక్కువగా వస్తున్నా, స్టేషన్‌లో అభివృద్ధి పనులు మాత్రం చేపట్టడం లేదనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. ఇక్కడి నుంచి నిత్యం వ్యాపారులు బరంపు రం, కోల్‌కత్త, ఖుర్దా, భువనేశ్వర్ వెళ్తుంటారు. వందలాదియంది వైద్యం కోసం విశాఖపట్నం,హైదరాబాద్ రాకపోకలు సాగిస్తుంటారు. స్టేషన్‌లో ప్రయాణీకులకోసం ఏర్పా టుచేసిన ప్లాట్‌ఫారాల్లో షెడ్లు లేకపోవడంతో ఎండికు ఎండి వర్షానికి తడాల్సి వస్తోంది. తాగునీటి సరఫరా సక్రమంగా ఉండడం లేదని, మరుగుదొడ్లకు నిత్యం తాళాలువేసి ఉంటున్నాయని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. స్టేషన్‌లోకి రైలు వచ్చే సమయంలో బోగిలు నిలిపే చోట డిస్‌ప్లేచేసే డిజిటల్ బోర్డులు ప్లాట్‌ఫారాలపై ఏర్పాటుచేయలేదు. దీంతో. రైలు వచ్చే సమయంలో ఏ బోగి ఎక్కడ ఆగుతుందో తెలియకపోవడంతో ప్రయాణికులు అవస్థలుపడుతున్నారు. రైల్వేస్టేషన్‌లో అభివృద్ధిపనులు చేపట్టాలని, పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదలచేయాలని ప్రజాప్రతినిధులు, రైల్వే ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందజేస్తున్నట్లు స్థానిక యూజర్స్ కమిటీ సభ్యులు చెబుతున్నారు. ఉద్దానం ప్రాంత ప్రజలంతా ఎక్కువగా కంచిలి రైల్వే స్టేషన్‌పైనే ఆధారపడుతుంటారని, ఇక్కడ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్ సదుపాయం కల్పిస్తే తప్ప ఎటువంటి ప్రయోజనం ఉండదని పేర్కొంటున్నారు.



నిరుపయోగంగా తాగునీటి కొళాయి



కానరాని డిజిటల్ బోర్డులు

డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయాలి



రైల్వే ప్లాట్‌ఫారాలపై డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయాలి. అవి లేకపోవడంతో ట్రైన్ వచ్చే సమయంలో పిల్లలతో ఎక్కాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. ఈ విషయంలో అధికారులు త్వరగా చర్యలు తీసుకుని ఏర్పాటుచేయాలి.

- రవికుమార్, కంచిలి

మౌలిక వసతులు కల్పించాలి



కంచిలి స్టేషన్‌లో మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉంచుతున్నారు. దీంతో పిల్లలతో స్టేషన్‌కు వచ్చే సమయంలో ఇబ్బందిపడుతున్నాం. తాగునీరు తదితర మౌలిక సౌకర్యాలను రైల్వే అధికారులు కల్పించాలి.

- జగన్నాథరావు, రిటైర్డు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి, కంచిలి

ఆశ్రమ సామగ్రి ధ్వంసంపై ఫిర్యాదు

ఎచ్చెర్ల: తోటపాలెం పరిధిలో ఉన్న వేదవ్యాస రామానుజ ఆశ్రమంలో గతంలో పనిచేసిన ఇద్దరు వ్యక్తులు చొరబడి సామగ్రి ధ్వంసం చేసినట్టు ఆశ్రమ వ్యవస్థాపకులు పొన్నాడ మధుసూదన రామానుంజేయదాసు బుధవారం పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. తోటపాలెం గ్రామానికి చెందిన తల్లీకొడుకులైన పందిరి గోవిందమ్మ, సాయికిరణ్ రెండు నెలల కిదట వరకు ఇదే ఆశ్రమంలోనే పనిచేశారన్నారు. అయితే ఈ నెల 16వ తేదీన వీరిద్దరు ఆశ్రమంలోని వాటర్ ట్యాంకు, టాప్‌లు, పైపులను విరగొట్టారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆశ్రమ వ్యవస్థాపకులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

సారా స్థావరాలపై దాడులు

హరిపురం: మందస మండలం కొండలోగాం పంచాయతీ చాపరాయి గ్రామంలో బుధవారం ఎస్ఈబీ పోలీసులు దాడులు నిర్వహించారు. 1200 లీటర్ల బెల్లం ఊటలు, 35 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ సీఐ జైభీమ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాలతో సారాపై పూర్తిస్థాయిలో నిఘా పెట్టామన్నారు. తయారీని అడ్డుకొని అక్రమ రవాణాపై దృష్టి సారిస్తామని చెప్పారు. ఈ దాడుల్లో ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది కాంతారావు, శాంతారావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులపై వేధింపులు ఆపాలి



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

అరసవల్లి: మున్సిపల్ కార్మికులపై వార్డు సెక్రటరీలు, కూటమి ప్రభుత్వ వార్డు ఇన్‌చార్జీల వేధింపులు ఆపాలని ఆ సంఘ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఉదయం నగరంలోని మస్టర్ పాయింట్ల వద్ద కార్మికులంతా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సీఐటీయూ అనుబంధం) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం మాట్లాడుతూ.. కార్పొరేషన్ పరిధికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. చనిపోయిన కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని, పర్మినెంట్ కార్మికుల సరెండర్ లీవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సక్రమంగా పనిముట్లు ఇవ్వాలని, మస్టర్ పాయింట్ల వద్దనే ఎఫ్ఆర్ఎస్ తీయాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ ఒకపని, వార్డు ఇన్‌చార్జి ఒక పని, సెక్రటరీ ఒక పని చెబుతున్నారని, తమ పనిని సక్రమంగా చేసుకోనివ్వకుండా ఆటంకం కలిగిస్తున్నారని, లేకుంటే కార్మికులను బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ నగర అధ్యక్షుడు ఎ.గణేష్, ప్రతినిధులు ఎ.రాము, ఎ.జనార్దన్, డి.యుగంధర్, ఎ.శంకర్, ఎస్.పార్వతి, ఆర్.ఈశ్వర్మ, ఎ.గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన అధికారులు

శ్రీకాకుళం క్రైం: జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన కేవీ మహేశ్వరరెడ్డిని పలువురు అధికారులు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం విజిలెన్స్ ఎస్పీ ఎ.సురేష్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎ.చంద్రశేఖర్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ తిరుపతినాయుడు, ఏపీఎస్ ఆర్టీసీ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ రీజనల్ మేనేజర్ ఎ.విజయ్‌కుమార్, శ్రీకాకుళం-1, 2 డిపోల మేనేజర్లు మల్లికార్జునరాజు, శర్మ ఎస్పీని కలుసుకున్నారు. ఈ సందర్భంగా శాఖాపరమైన పలు విషయాలపై వారు చర్చించారు.



ఎస్పీని కలిసిన విజిలెన్స్ ఎస్పీ

ఆక్రమణలను తొలగిస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రణస్థలం: కోటపాలెంలో సర్వే నెంబరు 258/2లో 36 ఎకరాల చెరువు ఆక్రమణలపై 'రూ.30 కోట్ల భూమి హాంఫట్' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో బుధవారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. దీంతో సంబం ధిత అధికారులు బుధవారం హు టాహుటిన బుచ్చివానిగెడ్డను పరిశీలించారు. రెవెన్యూ పరిశీలకులు శ్రావణి, సర్వేయర్ రవి మొత్తం చెరువు గర్భాన్ని కొలతలు వేసి ఆక్రమణలను గుర్తించారు. ఇందులో సుమారు 15 ఎకరాల వరకు 13 మంది వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడ్డారని గుర్తించారు. ఈ గెడ్డ మధ్యగా రోడ్డును కూడా వేశారు. అలాగే కొబ్బరి, అరటి మొక్క లను కూడా వేసినట్టు గుర్తించారు. దీనిపై తహసీల్దార్ రామారావు మాట్లాడుతూ.. ఈ చెరువులో భారీగా ఆక్రమణలు ఉన్నట్టు గుర్తించామని రెండు రోజుల్లో తొలగి స్తామని స్పష్టం చేశారు.



కొలతలు వేస్తున్న రెవెన్యూ సిబ్బంది

సామాన్యుల కలల బడ్జెట్

అరసవల్లి: కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి ప్రత్యేక కేటా యింపులపై టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తోణంగి వెంకన్న యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఏపీ రాజధాని అమరావతి నిర్మా ణానికి రూ.15వేల కోట్లు కేటాయించిన కేంద్రం, అవసరమైతే పెంచుతామనడం సంతోషకరమన్నారు.

- **గార:** రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణం పూర్తి చేసేందుకు కేంద్రం బడ్జెట్‌లో రూ.15 వేల కోట్లు కేటాయించడంపై మండల టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం అమరావతి నిర్మాణాన్ని పూర్తిగా విస్మరించిందని, ఇప్పుడు కూటమి ప్రభుత్వంతో శరవేగంగా నిర్మాణం పూర్తవుతుందన్నారు. టీడీపీ నాయకులు పీసా వెంకటరమణ మూర్తి, గుండ భాస్కరరావు, బడగల వెంకట అప్పారావు జీవీ రమణమూర్తి, అబ్బాయి, మళ్ల నర్సింగరావు హర్షం వ్యక్తం చేశారు.

వేలంపాట వాయిదా

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయ అనివెట్టి మండపంలో బుధవారం నిర్వహించిన తలనీలాలకు వేలంపాట వాయిదా పడింది. ఏడాది కాలానికి సంబంధించి పాట నిర్వహించగా.. గతేడాది కంటే తక్కువకు పాట నమోదు కావడంతో ఆలయ అధికారులు వాయిదా వేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్, శ్రీకూర్మం ఆలయ ఈవో జి.గురునాథ రావు, జూనియర్ అసిస్టెంట్ బీఎస్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

కూర్మనాథుని హుండీల లెక్కింపు రేపు

గార: ప్రసిద్ధ శ్రీకూర్మనాథుని దేవస్థానం హుండీలను ఈ నెల 26వ తేదీ శుక్రవారం ఉదయం 9 గంటలకు తెరచి లెక్కించనున్నట్టు ఆలయ ఈవో జి.గురునాథరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

4న పోతన భాగవతంపై అవధానం

శ్రీకాకుళం కల్చరల్: పాలకొండ రోడ్డులో ఉన్న ఉపనిషన్మందిరంలో వచ్చే నెల 4న పోతనగారి భాగవతం నిర్వహించనున్నట్టు అధ్యక్షుడు గుమ్మా నగేష్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దశమ స్కంధం పూర్వ భాగంలో ఉన్న సుమారు 1800 వరకు ఉన్న పద్య గద్యముల పై మహాధారణావధానం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అవధారణాకర్తగా విశాఖకు చెందిన ఓరుగంటి రాజరాజేశ్వరి ప్రసాద్ వ్యవహరిస్తారన్నారు. అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పశువులకు టీకాలు

లావేరు: పశువులకు వచ్చే లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని మండల పశువైద్యాధికారిణి లావణ్య పాడి రైతులను కోరారు. బుధవారం లావేరు, బొంతుపేట, లోపెంట, ఆరంగిపేట గ్రామాల్లో సుమారు 500 పశులకు లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ టీకాలను ఆగస్టు నెల మొదటి వారం వరకు వేయనున్నట్టు తెలిపారు.

మాతా, శిశు మరణాల నియంత్రణే లక్ష్యం

- డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి

అరసవల్లి: గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, మాతా, శిశు మరణాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి పిలుపునిచ్చారు. బుధవారం తన కార్యాలయంలో పట్టణ/ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గల ఆశా నోడల్ అధికారులకు కిల్కారి మొబైల్ అకాడమీ సేవలపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. వాయిస్ కాల్స్ సేవలతో మరణాల నియంత్రణే లక్ష్యంగా సేవలందించాలని, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాజు లంకపల్లి, స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ ఆర్.మోహనరావు, రీజనల్ అధికారి శ్రీముఖలింగం, శైలజ, రవిప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో మీనాక్షి

వరద ముంపు లేకుండా ముందస్తు చర్యలు

శ్రీకాకుళం అర్బన్: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా నాగావళి నదీ తీర ప్రాంతాలు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యలు చేపట్టామని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఒబులేసు స్పష్టం చేశారు. ఈ మేరకు నాగావళి నదీతీర ప్రాంతాలైన బలగ, రెల్లివీధి, తురాయి చెట్టు వీధి, మంగువారి తోట, కలెక్టర్ బంగ్లా సమీప సెక్టార్లలో పరిశీలించామన్నారు. ఇప్పటికే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడామని, అవసరమైతే గోడలు నిర్మించేందుకు 500 ఇసుక బస్తాలను సిద్ధం చేశామన్నారు. అలాగే విశాఖ-ఏ కాలనీలో డ్రైనేజీలు లేక వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తుందని స్థానికులు చెప్పడంతో బుధవారం ఉదయం కమిషనర్ ఒబులేసు ఆ ప్రాంతంలో పర్యటించారు. ఇంజనీరింగ్ అధికారులను పిలిపించి డ్రైనేజీల నిర్మాణానికి నివేదికలు అందించాలని ఆదేశించారు. తాత్కాలికంగా సమస్యను పరిష్కరించేందుకు ఖాళీ స్థలంలోకి మురుగు నీటిని తరలించారు. అనంతరం నాగావళి నదిలో వరదనీటి ప్రవాహం పెరుగుతుండడంతో పరిస్థితులను పరిశీలించారు.



నదీ తీరాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

యూనియన్ బ్యాంక్‌లో అర్ధ వార్షిక సమావేశం



సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

గుజరాతీపేట: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో 'టాలిక్' అర్ధ వార్షిక సమావేశం ఇటీవల జరిగింది. అధికార భాష అమలకు సంబంధించి భారత ప్రభుత్వ హోం మంత్రిత్వ శాఖ జారీచేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా శ్రీకాకుళం పట్టణ అధికార భాషా అమలు కమిటీ అర్ధవార్షిక సమావేశాన్ని ఈనెల 22న నిర్వహించినట్టు 'టాలిక్' సభ్య కార్యదర్శి బి.జయ్‌కుమార్ చౌదరి తెలిపారు. ఈ సమావేశంలో శ్రీకాకుళం నగరంలో ఉన్న అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయా లు, అండర్ టేకింగ్స్, ఇన్సూరెన్స్ కంపెనీలు, జాతీయ బ్యాంకుల కార్యాలయ అధికారులు పాల్గొన్నారు. కేంద్రప్రభుత్వ అధికార భాషా విధానం అమలుపై చర్చించారు. అనంతరం అధికార భాషా అమలు విషయంలో ఉత్తమ పనితీరు కనబరిచిన సభ్య కార్యాలయాలకు రాజ్ భాషా షీల్డ్‌ను అందజేశారు. కార్యక్రమంలో యూబీఐ రీజనల్ హెడ్ ఎం.వెంకట్ తిలక్, డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ కుమార్ బిస్వాస్, ఇన్‌కమ్‌టాక్స్ అధికారి కె.రవిశంకర్, ఎస్‌బీఐ రీజనల్ హెడ్ ఏఏ హసీబ్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డివిజనల్ హెడ్ నవీన్‌నేగి తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు..
రేపటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

ఎచ్చెర్ల: ఆర్జీయూకేటీ పరిధిలోని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ప్రవేశానికి ఇక్కడి క్యాంపస్‌లో ఈ నెల 26,27 తేదీల్లో సర్టిఫికెట్లను పరిశీలిస్తామని క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీజీడీ బాలాజీ తెలిపారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లపై ఆయన బుధవారం అధికారులతో సమీక్షించారు. '26న 515 మంది, 27న 521 మంది విద్యార్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తాం. సర్టిఫికేట్ల పరిశీలనకు 100 మంది అధ్యాపకులతో 15 బృందాలను ఏర్పాటు చేశాం. విద్యార్థులు అవసరమైన సర్టిఫికెట్లతో హాజరు కావాలి. విద్యార్థులకు అసౌకర్యం కలుగకుండా జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫోటోలకు వీలుగా క్యాంపస్‌లో అందుబాటులో ఉంచుతాం. విద్యార్థులు, తల్లిదండ్రులు వారి సొంత ఖర్చులతో భోజనం చేసేందుకు సౌకర్యం కల్పిస్తున్నామ'ని బాలాజీ తెలిపారు. కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ పి.గోవర్ధన్, ఏవో ముని రామకృష్ణ పాల్గొన్నారు.

సోంపేట జట్టుపై పాతపట్నం గెలుపు

ఇచ్ఛాపురం: క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీఐ ఇమ్మాన్యుయేల్ రాజు అన్నారు. ఐసీసీ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో సురంగిరాజా మైదానంలో ప్రారంభమైన ఇంటర్ స్టేట్ క్రికెట్ టోర్నీని సీఐ ప్రారంభించారు. బుధవారం సోంపేట, పాతపట్నం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సోంపేట జట్టు కేవలం 17 ఓవర్లలో 84 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్ చేసిన పాతపట్నం జట్టు నిర్ణీత 12.5 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 85 పరుగులు చేసి విజయం సాధించింది. అత్యధిక పరుగులు చేసిన పాతపట్నం జట్టు బ్యాట్స్‌మెన్ చిక్కు బిసాయ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. సీఐ చేతుల మీదుగా అవార్డు అందజేశారు. ఐసీసీ క్లబ్ అధ్యక్షుడు దాసరి రాజు, బత్తుల వెంకటరమణ, కాళ్ల నర్సింహమూర్తి, రామారావు, కోచ్ గోపి పాల్గొన్నారు.

శ్రీకాకుళం-ఆమదాలవలస రోడ్డును పూర్తి చేయండి

అరసవల్లి: వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో జిల్లాలో రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయని, ప్రత్యేకించి శ్రీకాకుళం - ఆమదాలవలస రోడ్డు పరిస్థితి మరింత దారుణమని, ఆ రోడ్డులో ప్రయాణించి ఎందరో ప్రాణాలు కోల్పోయారని, అటువంటి రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టి పూర్తి చేయాలని శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ శాసన సభాపతిని కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొన్న ఆయన బుధవారం తొలిసారి అసెంబ్లీలో నియోజకవర్గ సమస్యలపై గళమెత్తారు. రోడ్లు, కాలువల పరిస్థితి అధ్వానంగా మారిందని, అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు తయారుచేసి, నిధులు మంజూరు చేస్తే జగన్మోహన్‌రెడ్డి వాటిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఎస్పీని కలిసిన లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం క్రైం: ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మహేశ్వరరెడ్డిని లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ప్రతినిధులు బుధవారం కలిసి ఎస్పీకి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ఎస్పీకి అధ్యక్షుడు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ వివరించారు. నగరంలో పచ్చదనం పెంచేలా మొక్కలు నాటాలని ఎస్పీ సూచించారన్నారు. లయన్స్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవి కుమార్, మెంటార్ నటుకుల మోహన్, డీసీ డాక్టర్ బి.దేవభూషణం, సెక్రటరీ డాక్టర్ పి.సిందూర, సభ్యులు శివతేజ, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి పెద్దపీట

గుజరాతీపేట: కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆంధ్రప్రదేశ్‌కు పెద్దపీట వేసిందని వివిధ వర్గాలకు చెందిన మేధావులు కొనియాడారు. బీజేపీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో 80ఫీట్ రోడ్డులోని ఓ ప్రైవేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రధాని మోదీ సారథ్యంలో అన్ని వర్గాల వారికి న్యాయం చేశారన్నారు. రాష్ట్రానికి డబుల్ ఇంజన్ సర్కార్ రావడం వల్ల మేలు జరిగిందన్నారు. రాజధాని ఏర్పాటు, పోలవరం పూర్తి చేసే బాధ్యత కేంద్రానిదే అని బడ్జెట్‌లో ప్రస్తావించడం గొప్పవిషయమన్నారు. బంగారంపై సెస్ తగ్గించి చరిత్రలో నిలిచిపోయేలా చేశారన్నారు. సమావేశంలో శ్రీకాకుళం నగర ప్రముఖులు ఐకే రావు, బొడ్డేపల్లి సురేష్, పొట్నూరు శ్రీనివాసరావు, పేర్ల సాంబమూర్తి, నటుకుల మోహన్, కోరాడ హరగోపాల్, పొట్నూరు రమేష్ చక్రవర్తి, పార్టీ నాయకులు పూడి తిరుపతిరావు, అట్టాడ రవిబాబ్జీ, శవ్వాన ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయాల పితామహుడి జయంతి

శ్రీకాకుళం కల్చరల్: గ్రంథాలయోద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ లైబ్రేరియన్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీవీ భాస్కరరాజా, సిబ్బంది ప్రత్యూష, రామ మోహన్, రిటైర్డ్ జూనియర్ అసిస్టెంట్ కె.చిరంజీవు పాల్గొన్నారు.



శ్రీకాకుళం కల్చరల్: నివాళులర్పిస్తున్న దృశ్యం

- **ఆమదాలవలస:** గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి బుధవారం ఆమదాలవలస శాఖా గ్రంథాలయంలో నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు జయలక్ష్మి, గ్రంథ పాఠకులు షన్ముఖ, ఆంజనేయులు, నారాయణ, రాజు, శంకర్ పాల్గొన్నారు.

సకాలంలో ఓడీఎఫ్ సర్వే పూర్తి చేయాలి

ఆమదాలవలస: ఓడీఎఫ్ ప్లస్ సర్వే సకాలంలో పూర్తి చేయాలని డీఎల్‌పీవో ఆర్.గోపిబాల సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఎస్.వాసుదేవరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఇంటికీ వెళ్లి మరుగుదొడ్లు ఉన్నవి లేనివి గుర్తించి నివేదించాలని ఆదేశించారు. విషజ్వరాలు, అంటు రోగాలు ప్రబల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

- **కంచిలి:** ఓడిఎఫ్ సర్వేను వారం రోజుల్లో పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ మోహన్‌రావు అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. అనంతరం యాప్ ద్వారా సర్వే ఎలా చెయ్యాలో వివరించారు. ఎంవోటీ పి.చాణక్య, సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తోనే సురక్షిత ప్రయాణం

శ్రీకాకుళం క్రైం: వాహన చోదకులు హెల్మెట్ ధరించడం ద్వారా సురక్షితంగా ప్రయాణించగలరని ట్రాఫిక్ సీఐ ఎం.అవతారం తెలిపారు. బుధవారం విజుబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ, వాహనాల తనిఖీలు చేపట్టారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ట్రాఫిక్ ఎస్ఐ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సత్ప్రవర్తన కలిగి ఉండాలి

సరుబుజ్జిలి: విద్యార్థులందరూ సత్ప్రవర్తన కలిగి ఉండాలని ఎస్ఐ బి.నిహార్ అన్నారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా ప్రభుత్వ చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ నిహార్ మాట్లాడుతూ.. విద్యార్థులు తెలిసీతెలియని వయసులో చెడు వ్యసనాలకు లోనై భవిష్యతును నాశనం చేసుకోవద్దన్నారు. ప్రిన్సిపాల్ రాబిల్లి భూషణరావు ఎస్ఎస్ఎస్ పీవో రమేష్‌సాహు పోలీస్ సిబ్బంది జనార్దనరావు, అధ్యాపకులు నాగేంద్ర, ఆకెళ్ల రామారావు, శ్రీనివాసరావు, విజయ, వినోద్‌రాజు, బోటనీ విజయ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నగరంలో జాబ్‌మేళా రేపు

అరసవల్లి: నగరంలోని ఆసుపత్రి జంక్షన్ సమీపంలో గల ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐలో ఈ నెల 26వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి కె.సుధ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు, ఎంఎస్ ఆటోమోటివ్ మాన్యుఫ్యాక్చరర్స్ ప్రైవేట్ లిమిటెడ్, 2050 హెల్త్‌కేర్ కంపెనీల్లో 93 పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామ న్నారు. ఇంటర్, ఐటీఐ డీజిల్ మెకానిక్, మోటార్ మెకానిక్, ఎస్ఎస్‌సీ పాస్ లేదా ఫెయిల్, జీఎన్ఎం అర్హత గల స్త్రీ, పురుష అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు తీసుకుని హాజరుకావాలన్నారు. ఎంపికైన వారు శ్రీకాకుళం, సాలూరు, విశాఖ, అనకాపల్లి, హైదరాబాద్‌లో పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

సరుబుజ్జిలి: రొట్టవలస 11 కేవీ ఫీడర్ పరిధిలోని కొన్ని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, చెట్టుకొమ్మలు తొలగించడానికి ఈ నెల 26వ తేదీ శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఈఈ బయ్యన్నాయుడు తెలిపారు. రొట్టవలస, పాలవలస, కొండవలస, పెద్దపాలెం, వెంకటా పురం, పురుషోత్తపురం, అలమాజీపేట గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

- **ఎచ్చెర్ల:** ఎచ్చెర్లలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎచ్చెర్ల, అనమిత్ర టౌన్‌షిప్‌నకు ఈ నెల 26వ తేదీన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ ఎస్.బయ్యన్నాయుడు బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యా హ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు.
- **పొందూరు:** లోలుగు 11కేవీ ఫీడర్ పరిధిలో ఈ నెల 26న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బయ్యన్నాయుడు తెలిపారు. ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

దివ్యాంగుల జాతీయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరచిన జిల్లాలో గల దివ్యాంగులకు, దివ్యాంగుల సాధికారత కోసం కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థల నుంచి జాతీయస్థాయి అవార్డులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆశాఖ ఏడీ కె.కవిత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన దివ్యాంగులు, వ్యక్తులు, సంస్థలు ఈ నెల 31వ తేదీలోగా సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేటి నుంచి పీఈటీల సదస్సులు

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయుల (పీఈటీ) సదస్సులను ఈ నెల 25 నుంచి డివిజనల్ స్థాయిలో నిర్వహించనున్నట్టు డీఈవో కె.వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళం డి విజన్‌కు సంబంధించి ఈ నెల 25వ తేదీన మునసబుపేట వద్ద గల గురజాడ కళాశాలలో ఉదయం తొమ్మిది గంటలకు ప్రారంభమవుతుందన్నారు. 26వ తేదీన టెక్కలి డివిజన్‌కు సంబంధించి నౌపడ ఆర్ఎస్‌లో గల ప్రవీణ కళాశాలలో ఉంటుందన్నారు. ఈ సదస్సుల్లో అక్కడి డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోలు, పీడీలు, పీఈటీలు, అన్ని మేనేజ్‌మెంట్‌లో ఉన్న పీఈటీలు విధిగా హాజరు కావాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు, తమ పాఠశాలలో గల పీఈటీ, పీడీలను రిలీవ్ చేసి సదస్సుకు పంపించాలన్నారు. ఈ సదస్సులో ఈ ఏడాది ఎస్‌జీఎఫ్, గ్రిగ్స్, మండలస్థాయి, నియోజకవర్గం, జిల్లాస్థాయి సెలక్షన్స్, పోటీల కోసం చర్చించి నిర్ణయించడం జరుగుతుందన్నారు.

ప్రజా సంక్షేమ బడ్జెట్

శ్రీకాకుళం అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలందరిచే ఆమోదయోగ్యమైనదని జనసేన పార్టీ ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు ఏ ఒక్క రంగాన్ని విస్మరించకుండా, పదేళ్ల విజన్‌తో బడ్జెట్ రూపొందించారన్నారు. గ్రామీణ ఆర్థికాభి వృద్ధి, సమీకృత ఆర్థికాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇచ్చార న్నారు. ఐదేళ్లలో సుమారు 20లక్షల మంది యువతకు నైపుణ్యాల శిక్షణ, 500 పెద్ద కంపెనీల్లో ఇంటర్న్‌షిప్స్, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మూడు కోట్ల అదనపు ఇళ్ల నిర్మాణం, ముద్ర రుణాలు, మహిళలు, బాలికలకు ప్రత్యేక బడ్జెట్, కొత్త ఉద్యోగులకు మూడు ప్రోత్సాహకాలు ఇలా అన్నివర్గాలకు మేలు కలిగేలా బడ్జెట్ రూపొందించారన్నారు.



మాట్లాడుతున్న పిసిని చంద్రమోహన్